క్లుప్తంగా

'స్పందన'కు హాజరుకానున్న సబ్ కలెక్టర్

చిలమత్తూరు: ఈ నెల 24 మండల కేంద్రంలో నిర్వహించబోయే స్పందన కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కార్తీక్ హాజరు కానున్నట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్బీకేలో డివిజనల్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు..మండల ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు.. మండలంలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి తప్పక హాజరు కావాలన్నారు.

బియ్యం లారీ పట్టివేత



పోలీస్‌స్టేషన్ ఆవరణలో లారీ

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం సమీపంలో శుక్రవారం కర్ణాటక రాష్ట్రం పావగడ నుంచి తుమకూరుకు బియ్యం తరలిస్తున్న లారీని శ్రీ సత్యసాయి జిల్లా స్పెషల్ టీం పట్టుకుని అమరాపురం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. అయితే ఇది ఎవరూ తరలిస్తున్నారు అనే సమాచారం తెలియాల్సి ఉంది. స్థానిక ఎస్‌ఐ. వెంకటేశ్వర్లుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. పోలీసులు ఎవరు ఎక్కడి నుంచి బియ్యం బస్తాలను తరలిస్తున్నారో తెలుసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న చైర్మన్ ఉమర్ ఫారూక్ ఖాన్

పెనుకొండ: పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. బీఎల్‌ఓల ద్వారా త్వరలో ఓటరు నమోదు, తొలగింపులు తదితర విషయాలపై పూర్తిస్థాయిలో సర్వే చేపట్టనున్న నేపథ్యంలో చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు పోలింగ్ బూత్‌లు పరిశీలించారు. నాయకులు బోయబాబు, శ్రీరాములు, యిసాన్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం



గోపాల్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గోరంట్ల: స్థానిక ఎమ్మార్సీలో మండల ఇన్‌చార్జ్ విద్యాధికారి గోపాల్‌నాయక్, నూతన ఎంఈఓ జాన్‌రెడ్డిప్పను ఉపాధ్యా సంఘాల నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగేనాయక్, దామోదరరెడ్డి, ఆదినారాయణ, నాగరాజు,సుధాకరరెడ్డి, తిరుపాల్‌నాయక్, సూర్యనారయణరెడ్డి, శ్రీరామనాయక్, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ సంఘం రాజ్యాధ్యక్షుడిపై కేసు

పావగడ: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ రేషన్ కార్డుల సంఘం రాజ్యాధ్యక్షుడు కృష్ణప్ప, పావగడ తాలూకా రేషన్ కార్డుల పంపిణీ సంఘం అధ్యక్షుడు నాగరాజుపై కేసు నమోదైంది. మలు చేసిన అన్న భాగ్య యోజన ఆహార ధాన్యాల సరఫరా విషయంపై రాజ్యాధ్యక్షుడు కృష్ణప్ప మొబైల్ లో తనను అంతు చూస్తానని స్థానిక పౌర సరఫరాల శాఖ శిరస్తేదారు కృష్ణమూర్తిని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టర్‌కు వినతి

మడకశిర: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గుడిబండ మండలం రాళ్లపల్లికి చెందిన దళిత మహిళలు సీపీఐ ఇన్‌చార్జ్ పవిత్ర ఆధ్వర్యంలో కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం మడకశిరలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పవిత్ర తెలిపారు.

ప్రారంభమైన ఓటరు సర్వే



తూమకుంటలో వివరాలు సేకరిస్తున్న బీఎల్‌ఓ

హిందూపురం అర్బన్: 2024లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో ఓటరు జాబితాను పారదర్శకంగా ఉంచేందుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటి సర్వే మొదలైంది. హిందూపురం మండలం తూమకుంటలో బీఎల్‌ఓ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండే వారికి ఓటు హక్కు కల్పించేలా జాబితా తయారు చేస్తున్నారు. హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 2,35,729 మంది ఉండగా అందులో పురుషులు 1,19,100 మంది మహిళలు 1,16,609 మంది, ఇతరులు 20 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, ప్రాంతాల మార్పు చేపట్టారు.

సొంతింటి కల నెరవేరింది



ఇంటి పట్టా అందిస్తున్న వలంటీర్ విజయ్‌కుమార్

రొద్దం: గాజుల నాగమని భర్త వీరు దంపతులు చిన్నకోడిపల్లి నుంచి 30 ఏళ్ల క్రితం మండ కేంద్రానికి వచ్చి స్థిరపడ్డారు. సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెల్లదీస్తుండేవారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోమార్లు సొంతింటికోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరయ్యింది. అద్దె ఇంట్లో పడుతున్న కష్టాలు గుర్తించిన వలంటీర్ విజయ్‌కుమార్..మా ఇంటివద్దకొచ్చి దరఖాస్తు తీసుకుని, ఇల్లు మంజూరు చేయించారు.

ఇల్లు ఇప్పించారు



మాకు సొంతిల్లు లేదు. 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివసిచేవాళ్లం. మా వలంటీర్ విజయ్‌కుమార్ మా కుటుంబ సభ్యుడి మాదిరిగానే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు వర్తింపజేస్తున్నాడు. నా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు తీసుకెళ్లి ఇంటికోసం దరఖాస్తు చేశాడు. నాకు జగనన్న లేఅవుట్‌లో స్థలం మంజూరు చేయించాడు. ఇప్పుడు ఇల్లు కూడా మంజూరైంది. ఇంటినిర్మాణం చేపట్టాం. జగనన్న అమలు చేస్తున్న ఎన్నో పథకాలు వలంటీర్ వల్ల పేద ప్రజలకు అందుతున్నాయి.

లబ్ధిదారురాలు గాజుల నాగమణి, రొద్దం

నేడు 'జగనన్న సురక్ష'

పరిగి: కొడిగెనహళ్లి గ్రామ సచివాలయం-1లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో కొడిగెనహళ్లి-1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు.

నేడు గోనిపేటలో...

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేటలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు.

రొద్దం: మండలంలోని కోగిర గ్రామ సచివాయలంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

మడకశిరరూరల్: చందకచెర్లు, ఆమిదాలగొంది-1 గ్రామ సచివాలయాల వద్ద శనివారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి, తహసీల్దార్ ముర్షావలి తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అగళి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయ ఆవరణలో శనివారం ఉదయం 9:30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమంపై సమవేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర కుమార్ తెలిపారు.

మహాలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలు మొదలుకుని అర్చన, అభిషేకం, కుంకుమార్చన, అంకురార్పణ, తులసీపూజ చేశారు. తర్వాత అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకులు భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. కర్ణాటక ప్రాంతంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



నరసింహులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ తదితరులు

రొద్దం: కోగిరకు చెందిన సర్పంచ్ బోయ రమాదేవి భర్త రామకృష్ణ తండ్రి నరసింహులు (70) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర తదితరులు నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, కన్వీనర్ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, నాయకులు రాజారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న అమెరికా అమ్మాయి నృత్యం



అలరించిన క్రితి శాస్త్రీయ నృత్యం

అనంతపురం కల్చరల్: అమెరికాలో స్థిరపడిన అనంత కళాకారిణి క్రితి అరంగేట్రంతోనే ఆకట్టుకుంది. అమెరికాలో నేర్చుకున్న శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించడానికి అమెరికా నుంచి అనంతకొచ్చిన క్రితి శుక్రవారం సాయంత్రం స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. అన్నమయ్య, త్యాగయ్య సంకీర్తనలపై క్రితి చేసిన అభినయం, హావభావాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ మూలలను వదలని నాట్యగురువులు అపర్ణ సుందరంతో పాటు ఆర్కెస్ట్రా బృందం అమెరికా నుంచి వచ్చి తమదైన ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఆమె చెల్లెలు ద్రితి పియానోపై జాతీయ గీతాలు వాయించి, అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్య అతిథి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఇక్కడి వారే మర్చిపోతున్న తరుణంలో అమెరికా అమ్మాయిలు చక్కగా అభినయించడం అభినందనీయమన్నారు. క్రితి, ద్రితిలకు ఎంతో మంచి భవిష్యత్తుందని ఆశీర్వదించారు.

సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం , ఐఐఐటీ డీఎం, కర్నూలు ఆధ్వర్యంలో ఏపీ ఉన్నత విద్య ప్లానింగ్‌బోర్డు సంయుక్తంగా నిర్వహించిన బూట్ క్యాంప్ ఆన్ డ్రోన్ టెక్నాలజీస్ అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కల్పించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ కాలానుగుణంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు దీటుగా అధ్యాపకులు శిక్షణ పెంపొందించుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థిలోనూ నైపుణ్యాలు పెంపొందించే రీతిలో అధ్యాపకులు సంసిద్ధం కావాలన్నారు. వ్యవసాయానికి డ్రోన్‌టెక్నాలజీ అధికంగా వినియోగిస్తున్నారన్నారు. పంట పర్యవేక్షణ, తెగులు నియంత్రణ, నీటి పారుదల, పంట విశ్లేషణలో డ్రోన్‌లను వినియోగించాలని కోరారు. బెస్ట్ యూనివర్సిటీ, ఎస్కే యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఈశ్వర్ రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, సమన్వయకర్తలు డాక్టర్ కే కళ్యాణిరాధ, ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ కేవీ ఈశ్వరమూర్తి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు



హిందూపురం: సర్టిఫికెట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



పెనుకొండ: ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

హిందూపురం టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13, 15, 16వ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో సత్వర సేవలు, సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను ఎలాంటి రుసుం లేకుండా అధికారులే మీ ఇంటి వద్దకు వచ్చి అందజేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి దేశంలోనే రోల్ మోడల్ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. సంక్షేమం, అభివృద్ధిపరంగా రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. అనంతరం 1,879 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు షాజియా, మారుతీరెడ్డి, ఆసీఫ్, శివ, నాగేంద్రబాబు, మల్లికార్జున, రామచంద్ర, సునీత, మణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనాపురంలో జగనన్న సురక్ష.

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ వ్యాప్తంగా 1205 మంది లబ్దిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ, చైర్మన్ ఉమర్ ఫరూఖ్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సంజీవమ్మ, భాస్కర్ నాయక్, రామాంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నాయకులు మారుతీ, వెంకటేషులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై సర్వే

అమరాపురం: కెంకెర గ్రామంలో శుక్రవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబాలకు కావాల్సిన సర్టిఫికెట్లను అడిగి నమోదు చేసుకున్నారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి అర్హత ఉండి రాని వారిని గుర్తించి వారికి పథకాలు వచ్చేలా వివరాలను నమోదు చేసుకుని సచివాలయ అధికారులకు అందజేస్తామని వలంటీర్లు తెలిపారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సంజీవ రాయుడు, రామకృష్ణను సన్మానించారు. శుక్రవారం పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులకు ఎంఈఓ-2 ఆనంద్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసప్ప, వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

హిందూపురం టౌన్:మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, సమస్యను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చిన్నమార్కెట్ పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, సీఐటీయూ నాయకులు నరసింహప్ప, రాము, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, వీరేష్, రంగనాథ్, బాబా ఫక్రుద్దీన్, హేమంత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని 44వ నెంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టులో వాహనాల తనిఖీల్లో భాగంగా గోరంట్లకు చెందిన వేణు అనే వ్యక్తి వద్ద శుక్రవారం సాయంత్రం 75 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్టు సెబ్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చిలమత్తూరు: దోమకాటు వల్ల వ్యాపించే మలేరియా, చికెన్ గున్యా, డెంగీ, బోధకాలు వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జయచంద్ర కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

రొళ్ల: అగ్రహారం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను తీర్చాలని శుక్రవారం కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. గుడిబండకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ముళ్లకంపలు, మొద్దులు, రాళ్లు, ఖాళీ బిందెలు ఉంచి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, సర్పంచ్ సదాశివప్ప అక్కడికి చేరుకుని నీటి సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

భక్తులకు అన్నదానం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శుక్రవారం ఆస్పత్రి సిబ్బంది రోగులకు అన్నదానం చేశారు. నారాయణ సేవలో భాగంగా రోగులకు అన్నదానంతో పాటు మంచి నీటి సౌకర్యాన్ని కల్పించారు. రోగులు ఆరోగ్యంగా ఉండాలని సత్యసాయి బాబాను స్మరిస్తూ భజనలు చేశారు.

మంత్రి జయరాంకు ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, నాయకులు

మడకశిర: నియోజకవర్గ అభివృద్ధిపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షలో పాల్గొనడానికి రాష్ట్ర కార్మిక మంత్రి గుమ్మనూరు జయరాం తొలిసారిగా మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా వాల్మీకి సర్కిల్ వద్ద ఎమ్మెల్యే తిప్పేస్వామి, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎంపీ గోరంట్ల మాధవ్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ రామచంద్ర వచ్చారు. వీరందరూ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లాపురమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, సింగల్‌విండో అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, కలెక్టర్‌ను కలిసిన డాక్టర్ నళిని

మడకశిర: మడకశిరకు వచ్చిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబును శుక్రవారం కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె వారికి పూలమాలలు వేసి సన్మానించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగేగౌడ్ ఉన్నారు.

లెదర్‌పార్కులను ప్రారంభించాలని వినతి

రాష్ట్ర వ్యాప్తంగా లెదర్ పార్కులను ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం మంత్రి జయరాంకు డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు వినతిపత్రాన్ని అందించారు. వీటిని ప్రారంభించి దళిత యువతీయువకులను ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు హనుమంతు తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి



దీపికకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సూచించారు. మండలంలోని కొడికొండ పంచాయతీలోఆమె పర్యటించారు. శుక్రవారం ఉదయం ఆమె సర్పంచ్ లక్ష్మీదేవమ్మ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు సీనియర్ నాయకుడు రాజారెడ్డి నేతృత్వంలో పంచాయతీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ అభివృద్ధిపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, నాయకులతో చర్చించారు..మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు..కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాసీంఖాన్, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, సర్పంచ్ నీలిభాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల గొడవ.. ఒకరికి గాయాలు



గాయపడిన బాలకృష్ణ

హిందూపురం అర్బన్ : హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడ వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కొటిపి పంచాయతీ జూమాకుల పల్లిలో ఆటోల సీరియల్ విషయంలో గొడవపడ్డారు. ఆ తరువాత గార్మెంట్స్ పరిశ్రమ వద్దకు రాగానే ఆటో డ్రైవర్ బాలకృష్ణతో సోమేష్, రవి గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడున్న వారు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుడిబండ: మండలపల్లి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులందరూ పాల్గొనాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

లేపాక్షి: మండలంలోని పి.కొత్తపల్లిలో సర్పంచ్ మంజునాథ్ సహకారంతో నీటి సమస్యను పరిష్కరించారని గ్రామస్తులు తెలిపారు. ఈనెల 18న జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి దృష్టికి గ్రామస్తులు నీటి సమస్యను తీసికెళ్లారు. స్పందించిన వారు సర్పంచ్‌తో మాట్లాడి పంచాయతీ నిధులతో మోటర్, పంపు వేసి నీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. సర్పంచ్ తన సొంత నిధులతో మోటరు, పంపును బోరుబావికి ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించారు.

ఓటరు జాబితా సవరణపై సర్వే

రొళ్ల: మండల వ్యాప్తంగా ఓటరు జాబితా సవరణలో భాగంగా శుక్రవారం నుంచి ఇంటింటా సర్వే ప్రక్రియ ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ సర్వే ప్రక్రియపై వీఆర్వోలు, బీఎల్‌ఓలతో ఆరా తీశారు. వచ్చే నెల ఆగస్టు 21 వరకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపడతామన్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించాలన్నారు.

అగళి : తహసీల్దార్ కార్యలయంలో శుక్రవారం ఓటరు నమోదుపై అన్ని పార్టీల నాయకులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని నాయకులు డిప్యూటీ తహసీల్దార్ సుబ్బరావును కోరారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు నాయకులు నరసప్ప, ఆంజనేయులు, పుల్లన్న, గోవిందప్ప, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.